క్లుప్తంగా

నేలబెలుంలో విశేష పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయాన్ని పూలు, మామిడి ఆకులతో అందంగా అలంకరించారు. భక్తులు బిలంలోని నీటిలో స్నానాలు చేసి మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కడ సోమవారం నిర్వహించే తిరుణాల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ చైర్మన్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్టించిన మానసాదేవి, కుమారస్వామి, నాగ విగ్రహాలు

కోవెలకుంట్ల: స్థానిక గాంధీనగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం మానసాదేవి, కుమారస్వామి, నాగ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, ఆవాహిత దేవతా హోమాలు, గర్తన్యాసం, యంత్ర విగ్రహ ప్రతిష్ట, బింబాక లాన్యాసం, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం, కక్ష జ్వాలా, కూష్మాండబలి, పూర్ణాహుతి, నాగప్రతిష్ట, తదితర పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు, కలుగొట్ల, కోవెలకుంట్ల, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలోని సంజామల, ఆకుమ ల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఈ వారం వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు.

జేఏసీ చైర్మన్‌గా కిశోర్‌కుమార్



బనగానపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న ఇంగ్లీష్ అధ్యాపకుడు కిశోర్ కుమార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) జిల్లా చైర్మన్‌గా ఎంపికయ్యారు. ఆదివారం నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

చోరీకి పాల్పడిన మహిళ అరెస్ట్

డోన్ రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో చోరీకి పాల్పడిన మహిళను అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ బిందు మాధవి ఆదివారం తెలిపారు. నెల క్రితం డోన్ రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద వెల్దుర్తి మండలం ఎల్.బండ గ్రామానికి చెందిన మాధవ కిట్టుకు చెందిన 12 తులాల వెండి పట్టీలు చోరీకి గురైంది. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను గుర్తించారు. స్టేషన్‌లో నిఘా ఉంచారు. సదరు మహిళ శనివారం డోన్ రైల్వేస్టేషన్‌కు రావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్నూలు జిల్లా నరసింహారెడ్డినగర్ కాలనీకి చెందిన పేరుపోగు దేవమణిగా గుర్తించారు. చోరీ చేసిన 12 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించారు. దేవమణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆడపిల్లలను గౌరవించాలి

డోన్ టౌన్: ఆడ పిల్లలపై చిన్నచూపు తగదని, వారిని గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి బాటలో పయనిస్తుందని రెవరెండ్‌లు రాజేంద్ర, సామేల్ అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రపంచ గర్ల్స్ చైల్డ్ డేను ఘనంగా నిర్వహించారు. బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని.. వీటిని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా నిలువరించాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి కమిటీ కార్యదర్శి మరియదాస్, కోశాధికారి విజయ రాణి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు సేవలకు గ్రహణం

- కూటమి ప్రభుత్వంలో ఆర్బీకే వ్యవస్థ నిర్వీర్యం
- రైతులకు సక్రమంగా అందని సేవలు
- నిరుపయోగంగా కియోస్క్‌లు
- బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాల్సిన పరిస్థితి

వ్యవసాయాన్ని పండుగగా మార్చాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గతంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్రాలు అందిస్తూ స్థానికంగానే సేవలందించిన ఆర్బీకే వ్యవస్థ ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోంది. కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. రాయితీ విత్తనాలకు పేర్లు నమోదుకు మినహా రైతులకు పెద్దగా ఉపయోగపడడం లేదు.

బనగానపల్లె నియోకజవర్గంలో ఆర్బీకే వివరాలు

మండలం	రైతు సేవా కేంద్రం
బనగానపల్లె	25
కోవెలకుంట్ల	10
కొలిమిగుండ్ల	13
అవుకు	18
సంజామల	11



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కానాలలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం



మూలన పడిన కియోస్క్ యంత్రం

సంజామల: వ్యసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం రైతులకు ఒంటరిని చేసి నిలబెట్టింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేసి విత్తనం నుంచి పంట విక్రయం వరకు అండా నిలబడి దేశం రాష్ట్రం వైపు చూసేలా చేసింది. రైతు భరోసా, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు అభయ హస్తం, రాయితీపై యంత్రాలు తదితర అంశాల్లో రైతులకు పెద్దపీట వేసింది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వ్యవసాయ సిబ్బందిని అందుబాటులో ఉంచి విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అందిస్తూ రైతులకు బాసటగా నిలిచింది. కానీ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల (రైతు సేవా కేంద్రం) సేవలు నిర్వీర్యం అవుతున్నాయి.

నియోజకవర్గం వ్యాప్తంగా 77 రైతు భరోసా కేంద్రాలు

రైతుల సంక్షేమం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి పల్లెలో రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు సలహాలు, సూచనలు అందించడం కోసం వ్యవసాయ అధికారులను నియమించింది. బనగానపల్లె నియోజకవర్గంలో 77 రైతు భరోసా కేంద్రాలను నిర్మించి రైతులకు సేవలను సులభతరం చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందించడం, పంట కొనుగోలు చేయడం, గిట్టుబాటు ధర కల్పించడం వంటి సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రం పేరు మార్చి, సేవలను తగించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుతంలో రైతులు వేసిన పంటను విలేజ్ అగ్రికల్చర్ సిబ్బంది ఈ-క్రాప్ నమోదు చేసేవారు. పంట నష్టం కలిగితే వెంటనే ప్రభుత్వం ఆదుకునేది. కానీ కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఈ-క్రాప్ చేయించుకున్న బీమా ప్రీమియం చెల్లించాలనే నిబంధన పెట్టింది.

ఉచిత పంట బీమా కొనసాగించాలి



మండలంలో శనగ, జొన్న తదితర పంటలు సాగు చేస్తున్నాను. బీమా లేకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిస్థితి ఏమిటి? ఉచిత పంట బీమాను కొనాసాగించాలి. ఈ సంవత్సరంలో తుపాన్‌ల కారణంగా రైతులు చాలా నష్టపోయారు. వారికి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

–మధు సుధాకర్, రైతు, సంజామల

ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచిత పంట బీమా, విత్తనాలు, ఎరువులు అందించేవారు. ఇప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువుల కొరత ఉంది. ప్రైవేట్ దుకాణాల్లో కొనాలంటే ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. అదే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచితే రైతులకు ఖర్చులు తగ్గుతాయి. ఆర్బీకేల్లో గతంలో ఉన్న విధంగా అన్ని సేవలను అందుబాటులో ఉంచాలి.

–కుపేంద్ర రెడ్డి, రైతు, సంజామల

సబ్సిడీ విత్తనాలు అందించాం



రబీ సీజన్‌లో శనగ విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించాం. అలాగే రైతు సేవా కేంద్రంలో కియోస్క్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. రబీ సీజన్‌లో సాగు చేసుకున్న వారు బీమా ప్రీమియం డిసెంబర్ 15వ తేదీలోపు చెల్లించుకోవాలి. కేవలం ఈ-క్రాప్ చేసుకుంటే పంట నష్టం కలిగితే పంట బీమా వర్తించదు. బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి.

–సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

రాచర్ల సున్నపురాయి గనికి అవార్డులు



బహుమతులు అందుకున్న అధికారులు

ప్యాపిలి: రాచర్ల సమీపంలోని రైన్ ఇండస్ట్రీస్‌లో నిర్వహిస్తున్న సున్నపు రాయి గనికి పలు విభాగాల్లో బహుమతులు వచ్చినట్లు ప్రియా సిమెంట్స్ పీఆర్‌ఓ కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన హైదరాబాద్ రీజియన్ 39వ సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాల్లో ఈ అవార్డులు దక్కినట్లు చెప్పారు. రాచర్ల సున్నపురాయి గనికి సేఫ్ మైన్స్ వర్కింగ్, సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టం, హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం అండ్ ట్రెనింగ్ తదితర విభాగాలతో పాటు ఓవరాల్ విభాగంలో మొదటి బహుమతి వచ్చినట్లు తెలిపారు. ఎలక్ట్రికల్ ఇన్సులేషన్, లోడింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ తదితర విభాగాల్లో ద్వితీయ బహుమతులు దక్కినట్లు పేర్కొన్నారు.

సాయం చేస్తేనే జీవితానికి సార్థకత

డోన్ టౌన్: సమాజంలో తోటి వారిని ఆదుకున్నప్పుడే జీవితానికి సార్థకత చేకూరుతుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. పట్టణానికి చెందిన చాకలి తాయన్న లివర్ వ్యాధితో బాధపడుతూ కుటుంబ పోషణ భారంగా మారింది. స్పందించిన చేయూత ట్రస్టు, ద్రోణాచలం సేవా సమితి సభ్యులు దాతల ఆర్థిక సహకారంతో తోపుడు బండి, ఇస్త్రీ పెట్టెతో పాటు నిత్యావసర సరుకులు, నగదును సీఐ చేతుల మీదుగా అందజేశారు.

అడ్మిషన్లకు 24 వరకు అవకాశం

బేతంచెర్ల:ఏపీ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 24వ తేదీ వరకు రూ.600 తత్కాల్ ఫీజు తో ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు భాగ్యోదయ హైస్కూల్ చైర్మన్ కానాల నాగలక్ష్మి దేవి తెలిపారు. కేవలం 5 నెలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులు పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు 9394239596 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

గ్రామాల అభివృద్ధికి అందరి సహకారం అవసరం





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, హాజరైన ప్రజా ప్రతినిధులు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి
- పలు సమస్యలను లేవనెత్తిన సభ్యులు

బేతంచెర్ల: గ్రామాల అభివృద్ధికి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ఆయా శాఖల నివేదికలను వినిపించారు. సభ్యులు సభ దృష్టికి తెచ్చిన పలు సమస్యలకు సమాధానం ఇచ్చారు. మండల పరిధిలోని గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మాట్లాడుతుండగా అంబాపురం సర్పంచ్ వెంకటేశ్వర్లు కలగజేసుకోవడంతో వాదోపవాదాలు జరిగాయి. దీంతో ఎంపీడీఓ కలగజేసుకుని ఇక్కడ రాజకీయాలు మాట్లాడకూడదని చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. మండల పరిధిలోని గోరుమానుకొండ వద్ద పాలిటెక్నిక్ కళాశాల భవనానికి రూ.36 కోట్లు మంజూరైనా నిర్మాణ పనులు చేపట్టలేదని సర్పంచ్ వెంకటేశ్వర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవన నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. కనుమ కింది కొట్టాల గ్రామ రహదారి నిర్మాణం పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు, బిల్ల స్వర్గ గుహల వద్ద టూరిస్టులు ఇబ్బందులు పడుతున్నారని తెలపగా.. రహదారి నిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల బర్త్‌సర్టిఫికెట్లలో పేర్లు తప్పుగా ఉండడంతో ఆపార్ నమోదుకు ఇబ్బందులు పడుతున్నారని పలువురు సర్పంచులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎంపీడీఓ సూచించారు. సమావేశంలో వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మి, ఏఈలు మహేష్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎంఈఓ సోమశేఖర్, సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, శ్రీరాములు, రాజు, తిమ్మయ్య, ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు శేషు, రామచంద్రారెడ్డి, ఇందిర పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: క్రీడల్లో రాణిస్తే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం దక్కుతుందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న అనిత, శ్రీలక్ష్మి, రజనీలను డీఎస్పీ కార్యాలయంలో అభినందించారు. వారికి ప్రోత్సాహకంగా బాక్సింగ్ కిట్లను అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి డోన్‌కు మంచి పేరు తీసుకునిరావాలని ఆకాంక్షించారు.

కమ్మ సంఘం కార్తీక వన భోజనాలు



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న కమ్మ కులస్తులు

బేతంచెర్ల: పట్టణంలోని షిరిడీ సాయి కల్యాణ మండపంలో కమ్మ సంఘం డోన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నం వెంకట కృష్ణారెడ్డి, పోలూరు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికా తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ హాజరయ్యారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కమ్మ సోదరులందరూ ఐక్యంగా కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక వనభోజనాలు నిర్వహించుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. పిల్లలకు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసి సన్మార్గంలో నడిచేలా చూడాలని సూచించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమ్మ సంఘం సభ్యులు రవి, ఉన్నం సుధాకర్, శేషప్ప నాయుడు, మురళీ, హరినాథ్, చంద్రశేఖర్, అరున్, బాబు పాల్గొన్నారు.

కనుల పండువగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ, మహా మంగళ హారతులు తదితర నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రెడ్లు ఐకమత్యంగా ఉండాలి



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

డోన్ టౌన్: రెడ్లు ఐకమత్యంగా ఉంటూ ఒకరికొకరు సాయపడాలని.. రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం డోన్ సమీపంలోని డాక్టర్ పోచా రెడ్డీస్ భవన్‌లో రెడ్ల వనభోజన మహోత్సవం నిర్వహించారు. పట్టణానికి చెందిన రెండ్లు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రారెడ్డి బహుమతులు అందజేశారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు



రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న లైబ్రేరియన్

కోవెలకుంట్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చదువు, సంపద, సంస్కారం గురించి విద్యార్థులకు గేయరూపంలో వివరించారు. అనంతరం లైబ్రేరియన్ మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ప్రపంచంలో జరుగుతున్న అనేక విషయాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాబు, గిద్దలూరు గ్రంథాలయ నిర్వాహకుడు మద్దిలేటి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బేతంచెర్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ''సమాజంలో గ్రంథాలయాల పాత్ర'' అనే అంశంపై విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయాధికారి మధుశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. గ్రంథాలయాలను తరచూ సందర్శిస్తూ విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

మాదిగల సమ్మేళనాన్ని జయప్రదం చేద్దాం



కరపత్రాలను విడుదల చేస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు

కోవెలకుంట్ల: మాదిగల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రామతీర్థం శేషు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టే బాధ్యత ఆయా రాష్ట్రప్రభుత్వాలదేనని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు నిచ్చిందన్నారు. వీలైనంత త్వరలో తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కర్నూలు కోల్స్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ ఫెడరేషన్ నాయకులు నరసింహులు, శ్రీనివాసరావు, కత్తి ఓబులేసు, దస్తగిరి, రాజు, పెద్దపుల్లయ్య పాల్గొన్నారు.



కొలిమిగుండ్లలో లైట్ల వెలుతురులో వెళ్తున్న వాహనదారులు

కమ్మేసిన పొగమంచు

నిశబ్దమైన తెల్లవారుజాము సమయంలో నిమ్మళంగా పొగమంచు కమ్ముకుంది. పల్లెల్లో జనం ఇంకా నిద్రమత్తులో నుంచి తేరుకోక ముందే ఊర్లన్నంటిని పొగమంచు దుప్పటిలా కప్పేసింది. ఆదివారం తెల్లవారుజామున కొలిమిగుండ్ల మండలంలోని పలు గ్రామాల్లో ఈ దృశ్యాలు కనిపించాయి. పొగమంచు ప్రధాన రహదారులను కప్పేసి దారి కనిపించకపోవడంతో వాహనదారులు లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. కొండలు, పొలాలన్నీ మంచులో కలిసిపోయాయి.

–కొలిమిగుండ్ల



కల్వటాలలో రహదారిని కప్పేసిన పొగమంచు



అంకిరెడ్డిపల్లెలో కొండ కనిపించకుండా ఏర్పడిన పొగమంచు

మూడు రోజుల పాటు విద్యుత్ కోతలు

ప్యాపిలి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం నుంచి బుధవారం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద పొదిళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుంట్లపల్లి, కలచట్ల ఎస్‌రంగాపురం గ్రామాల్లో మూడు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే 3ఫేస్ విద్యుత్ ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేస్తామన్నారు.

హెచ్‌ఆర్సీ, లోకాయుక్తలను కొనసాగించాలి

డోన్ టౌన్: కర్నూలులోని మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్త కార్యాలయాలను తరలిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్ అన్నారు.ఆదివారం డోన్‌లో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాయలసీమ, ముఖ్యంగా కర్నూలుకు అన్యాయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. మద్దిలేటిస్వామి, జనార్దన్, జీవన్‌బాబు ఉన్నారు.